## క్లుప్తంగా

### దేశంలో అనేక అసమానతలు



మాట్లాడుతున్న పాలసీ స్టడీస్ డైరెక్టర్ వినోద్

**సీతంపేట:** భారత ఆర్థిక వ్యవస్థ సక్రమంగా లేదని, దేశంలో అనేక అసమానతలు ఉన్నాయని సెంటర్ ఫర్ బడ్జెట్ అండ్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ వినోద్‌వ్యాసాలు అన్నారు. 'ఈజ్ ఏ క్రిటికల్ వ్యూ ఆఫ్ ద ఎకానమీ రిలవెంట్?' అనే అంశంపై గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం ప్రధాన సమస్యగా ఉందన్నారు. ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా ఎక్కువ మందికి పని కల్పించాలని చెప్పారు. ఐరోపా దేశాలతో పోల్చితే మన దేశంలో పన్నుల భారం ఎక్కువని, ఆర్థికాభివృద్ధికి జీడీపీ కొలమానం కాదన్నారు. ద్రవ్యోల్బణానికి కారణాలు వివరించారు. కార్యక్రమంలో ఆచార్య ప్రసన్నకుమార్, డి.ఎస్.వర్మ, డి.వి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

**మద్రిపాలెం:** కంచరపాలెం పరిధిలో ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. రెడ్డి కంచరపాలేనికి చెందిన చిటికెల దుర్గాప్రసాద్ తన తల్లితో కలిసి గవర కంచరపాలెం వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో ఊర్వశి జంక్షన్ నుంచి కంచరపాలెం మెట్టు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆ యువకుడి కాలికి, చేతికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు. తల్లి చిటికెల చిట్టమ్మ ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

### గ్లకోమా వ్యాధి ప్రమాదకరం

**ఆరిలోవ:** కంటికి సోకే గ్లకోమా వ్యాధి చాలా ప్రమాదకరమని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ శివాణి, డాక్టర్ సాయి యశ్వంత్ తెలిపారు. వరల్డ్ గ్లకోమా వీక్ సందర్భంగా గురువారం ఎల్వీపీ కంటి ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కళ్లకు కలిగే ఒత్తిడి కారణంగా గ్లకోమా సోకుతుందన్నారు. దీని లక్షణాలు బయటకు కనిపించవన్నారు. దీంతో గ్లకోమా సోకిన వ్యక్తి కంటి చూపు క్రమంగా పోతుందన్నారు. 40 సంవత్సరాలు దాటిన వారు ఏడాదికి ఒకసారి తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

### రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు 24 మంది


పోటీలు ప్రారంభిస్తున్న మోహన్‌కృష్ణ

**మధురవాడ:** రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు విశాఖ జిల్లా తరఫున పాల్గొనే మహిళ, పురుష జట్లకు 24 మంది ఎంపికయ్యారు. మధురవాడ శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్‌లో ఎంపిక పోటీలను గురువారం మధ్యాహ్నం సంస్థ చైర్మన్ ఎమ్.మోహన్‌కృష్ణ ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా పోటీలు జరిగాయి. వీరిలో 12 మంది చొప్పున పురుష, మహిళ జట్లను అబ్జర్వర్, ఎన్ఐఎస్ కోచ్ కె.చిట్టిబాబు పర్యవేక్షణలో ఎన్ఐఎస్ కోచ్‌లు కె.కావ్య, ఐ.చరణ్ ఎంపిక చేశారు. 9వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ వుమెన్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో లేడీస్ క్లబ్ ద్రోణ అకాడమీలో శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు.

**రాష్ట్ర జట్లు ఇవే..**

రాష్ట్ర స్థాయి పోటీలకు మహిళల జట్టుకి కె.లిఖిత, బి.రాజేశ్వరి, ఎన్.లహరి, డి.శృతిప్రియ, పి.ప్రసన్న, సీహెచ్.సాయిప్రభ, ఇ.జ్ఞానేశ్వరి, టి.లిఖిత, ఎ.జాహ్నవి, ఎమ్.జ్యోత్స్న, ఎస్.జ్యోతి, ఎస్.పూజిత ఎంపికయ్యారు. పురుషుల జట్టుకి ఎ.సంపత్, ఆకాశ్ వర్ధన్, ఎమ్.జోయెల్ యశ్వంత్ కుమార్, జి.రుత్విక్, వి.దిలీప్ కుమార్, కె.కార్తీక్, కె.శివశంకర్, ఎ.జీవన్, వి.పూర్ణచంద్ర ప్రసాద్, ఎస్.రాజేష్, ఎస్.సత్యనారాయణ, కె.మనోజ్‌కుమార్ ఎంపికయ్యారు.



# గెడ్డకు మోక్షం

- రైల్వే న్యూకాలనీ గెడ్డ ఆధునికీకరణ
- పూర్తయిన రిటైనింగ్ వాల్స్, బాటమ్ కాంక్రీట్ పనులు


నాడు : రైల్వే న్యూకాలనీ సింహగిరి లాడ్జి పక్కన ప్రమాదకరంగా గెడ్డ ఫుట్‌పాత్, కల్వర్టు


నేడు : అభివృద్ధి పనులు పూర్తయిన తరువాత గెడ్డ ఫుట్‌పాత్, కల్వర్టు

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ సింహగిరి లాడ్జి పక్కన గల గెడ్డకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రమాదకర స్థితి నుంచి బయటపడి ఆధునికీకరణ చెందింది. కొన్నేళ్లుగా ఈ గెడ్డ అభివృద్ధికి నోచుకోలేదు. దశాబ్దాల కిందట వేసిన డ్రైనేజీలు, కాలువలతో నిత్యం ప్రమాదకర పరిస్థితిలో ఉండేది. ఆయా సమయాల్లో కురిసిన వర్షాలకు గెడ్డ పైభాగం క్రమేపి కుచించుకుపోయింది. దీంతో దానిపై నిర్మించిన వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మరోవైపు ఈ కల్వర్టుపై నిర్మించిన ఫుట్‌పాత్‌లు కూడా శిథిలమై ప్రమాదకరంగా మారాయి. వాటి మీద నుంచి నడిచేటపుడు ఏ మాత్రం ఆదమరిచినా.. కింద గెడ్డలో పడాల్సిందే. ఇది ఒకప్పటి పరిస్థితి. నేడు ఈ గెడ్డను సుందరంగా తీర్చిదిద్దారు. ప్రమాదకర పరిస్థితిని రూపుమాపి అభివృద్ధి చేశారు. దీంతో ప్రజలు ప్రశాంతంతా ఈ గెడ్డపై రాకపోకలు సాగించే వీలు కలిగింది.

**వార్డు అభివృద్ధి నిధులతో..**

జీవీఎంసీ నూతన కౌన్సిల్ ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా వార్డుల అభివృద్ధికి రూ.1.50 కోట్ల నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి చొరవతో ఈ నిధుల్లో కొత్త మొత్తంతో గెడ్డ అభివృద్ధి పనులను పూర్తి చేయించారు. సుమారు రూ.48 లక్షల నిధులతో ఈ గెడ్డకు ఇరువైపులా రిటైనింగ్ వాల్స్, బాటమ్ కాంక్రీట్ పనులు పూర్తిచేశారు. ఈ గెడ్డ వాస్తవానికి 40 మీటర్ల మేర అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇది పూర్తయే సరికి సుమారు 60 మీటర్లు అయింది. దీంతో ఫుట్‌పాత్ మీద మిగిలిన కొంచెం పనులకు నిధులు సరిపోకపోవడం వల్ల వదిలేశారు. అది కూడా జీ–20 సదస్సు పనుల్లో భాగంగా పూర్తిచేయించేందుకు కార్పొరేటర్ ఏర్పాట్లు చేస్తున్నారు. గెడ్డ సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### చకచకా గెడ్డ అభివృద్ధి పనులు



కొన్నేళ్లుగా రైల్వే న్యూకాలనీ సింహగిరి లాడ్జి పక్కన ఉన్న గెడ్డతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్పొరేటర్‌గా గెలిచిన వెంటనే ఈ సమస్యను ఎలాగైనా పరిష్కరించాలని భావించాను. వార్డుకు కేటాయించిన నిధులతో దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా గెడ్డ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయించి, చకచకా పూర్తి చేశాం. మిగిలిన చిన్న పని కూడా త్వరలోనే పూర్తవుతుంది.

– ఆళ్ల లీలావతి, కార్పొరేటర్, 42వ వార్డు

## శాస్త్రోక్తంగా ఆలయాల ప్రారంభోత్సవం

నేడు విగ్రహాల ప్రతిష్టాపన


రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో సంకల్ప పూజలు చేస్తున్న భక్తులు

**కంచరపాలెం:** స్థానిక గొల్లకంచరపాలెంలో శ్రీరామా సేవా సమాజం(యాదవ్) ఆధ్వర్యంలో నిర్మించిన కోదండ సీతారామ, సంపత్ వేంకటేశ్వర స్వామి, ధనలక్ష్మిదేవి ఆలయాలను గురువారం శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీమాన్ రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో సంకల్ప పూజలు, యాగశాలలో వేదమంత్రాలతో హోమాలు నిర్వహించారు. 10వ తేదీ శుక్రవారం విగ్రహాల ప్రతిష్టాపన, ధ్వజస్తంభం, దేవతామూర్తులు, కలశాల ఏర్పాటు, 11వ తేదీ శనివారం ఉదయం సీతారాములు, సంపత్ వేంకటేశ్వర స్వామి కల్యాణం ఒకే వేదికపై నిర్వహించనున్నట్లు గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. అదే రోజు భక్తులందరికీ భారీ అన్నదానం చేస్తామని చెప్పారు. గ్రామ, ఉత్సవ కమిటీల సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### చిత్రకారుడు జాకబ్‌రాజుకు గౌరవ డాక్టరేట్


డాక్టరేట్‌తో జాకబ్‌రాజు

**కంచరపాలెం:** గోపాలపట్నం ప్రశాంత్‌నగర్‌కు చెందిన చిత్రకారుడు, ప్రభుత్వ ఐటీఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్, కిషోర్ ఫైన్ ఆర్ట్స్ అధినేత పిట్టా జాకబ్ రాజును గౌరవ డాక్టరేట్ వరించింది. అమెరికన్ యూనివర్సిటీ యునైటెడ్ నేషనల్ గ్లోబల్ పీస్ వారు బెంగళూర్ గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సంస్థ ప్రతి ఏటా సాంస్కృతిక, కళా రంగాల్లో విశిష్ట ప్రతిభ చూపిన వారి సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరిస్తోంది. 2023 సంవత్సరానికి గానూ ఫైన్ ఆర్ట్స్(చిత్రకళ పెయింటింగ్) విభాగంలో విశాఖకు చెందిన పి.జాకబ్ రాజుకు గౌరవ డాక్టరేట్‌ను అందించింది.

## విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**తాటిచెట్లపాలెం:** అక్కయ్యపాలెం సెక్షన్ 11 కేవీ గ్రీన్‌పార్క్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ జి.సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు శంకరమఠం రోడ్‌లోని స్టీల్ సిటీ కార్యాలయ ప్రాంతం, ఎన్‌జీజీవోస్ కాలనీ, ఐసీడబ్ల్యూఏఐ భవన్, జీవీఎంసీ పంప్ హౌస్, జీవీఎంసీ స్కూల్స్, విద్యుత్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్, కిన్నెర మెస్ ప్రాంతం, జీవీఎంసీ పార్క్ సచివాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.


**మురళీనగర్ సబ్ స్టేషన్‌లో..**

**మురళీనగర్:** మురళీనగర్ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో నిర్వహణ పనులు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్‌జీజీవోస్ కాలనీ, వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం, బర్మా కాలనీ, మసీదు వెనుక వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**జోన్–2 పరిధిలో..**

**మద్రిపాలెం:** జోన్–2 పరిధి మద్రిపాలెం సెక్షన్ 11 కేవీ కప్పరాడ ఫీడర్, 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ నిర్వహణ ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాంజీ ఎస్టేట్, సురేష్‌రాం నగర్, అరుంధతి నగర్, కప్పరాడ, పెదకొత్తూరు, బాపూజీనగర్, ఇందిరానగర్ ఫీడర్‌లోని ఇందిరా నగర్ 1–5, సంజీవయ్య కాలనీ, జైప్రకాష్‌నగర్–1, తిక్కవానిపాలెంలో విద్యుత్ ఉండదని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

## చెంచుల నాయకుడు రాములు కన్నుమూత


ఎన్.రాములు (ఫైల్)


రాములు పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న కె.కె.రాజు

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్ కాలనీ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు, చెంచుల నాయకుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నల్లబోతుల రాములు(82) బుధవారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురయ్యారు. అదే సమయంలో వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు అతడిని పరామర్శించారు. 30 ఏళ్లుగా చెంచుల కోసం నిలబడిన నాయకుడు రాములు. ఏఎస్సార్ నగర్ కాలనీకి కర్త, కర్మ, క్రియ అన్నీ ఆయనే. ఏఎస్సార్ నగర్ కాలనీ వాసులకు అక్కడే ఇళ్లు ఇప్పించడంలో కీలకపాత్ర పోషించారు. నగరంలో నివసించే దాదాపు 200 కుటుంబాలకు నాయకుడిగా, చెంచుల హక్కుల కోసం సుదీర్ఘ కాలం పలు పోరాటాల్లో పాల్గొన్న రాములు మరణంతో ఈ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణలు గురువారం రాములు పార్థివ దేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఇరుకు దారిలో భారీ వాహనాలు


కళా ఆస్పత్రి రోడ్డులో నిలిపిన భారీ వాహనం

ఇబ్బంది పడుతున్న స్థానికులు, పాదచారులు

**సీతమ్మధార :** ద్వారకానగర్‌లోని కళా ఆస్పత్రి రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతంలో పలు పాఠశాలలు, కాలేజీలతో పాటు ప్రైవేట్ కార్యాలయాలు, గొడౌన్లు ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులతో కిక్కిరిసి పోతుంటుంది. ఈ నేపథ్యంలో భారీ వాహనాలు గనుక ఈ రోడ్డులోకి వస్తే ఇక పరిస్థితి చెప్పనవసరం లేదు. ఆ వాహనానికి అటు ఇటు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి పోతుంటుంది. ఈ ప్రాంతంలో పలు వ్యాపార గొడౌన్లు ఉండటంతో భారీ వాహనాలు ఇక్కడి ఇరుకు రోడ్డులోకి ప్రవేశిస్తుంటాయి. దీంతో స్థానికులు, పాదచారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 10 గంటల తరువాత ఈ రోడ్డులోకి భారీ వాహనాలకు అనుమతి లేదు. అయినప్పటికీ అలాంటి వాహనాలు వస్తుండడంతో సమస్య ఎదురవుతోంది. ద్వారకానగర్‌లోని 1,2,3,4,5 లేన్‌లలో భారీ వాహనాల ప్రవేశంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అదే విధంగా ఇక్కడి కొన్ని విద్యా సంస్థలు, కోచింగ్ సెంటర్లు, ఇతర కార్యాలయాలకు చెందిన వాహనాలను చాలా వరకు రోడ్డు పైనే నిలిపివేస్తుండటం వల్ల కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

గురువారం మధ్యాహ్నం భారీ వాహనం ఒకటి రోడ్డుపై నిలిపివేయడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ ప్రాంతంలో తరచూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుండటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## గృహ నిర్మాణ సమస్య పరిశీలన


ఇంటి నిర్మాణదారులతో మాట్లాడుతున్న కె.కె.రాజు

**మద్రిపాలెం:** మురళీనగర్ సెక్టార్–3లో తప్పుడు పత్రాలతో గృహ నిర్మాణం చేపడుతున్నారని స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం ఆ ప్రాంతంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, కె.కె.రాజు 49, 50 వార్డుల కార్పొరేటర్లు అల్లు శంకరరావు, వావిలపల్లి ప్రసాద్‌తో కలిసి పర్యటించారు. స్థానికులను సమస్య అడిగి తెలుసుకున్నారు. మాస్టర్ ప్లాన్‌లో ఉన్న 60 ఫీట్ రోడ్డుపై తప్పుడు పత్రాలతో ఇల్లు కడుతున్నారని, స్థానికంగా ఉన్న డ్రెయిన్ పూర్తిగా తవ్వి మురుగు నీరు నిల్వలు ఉండేలా జీవీఎంసీ ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని నివాసులు ఆరోపించడంతో ఆయన వెళ్లి పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వారికి కె.కె.రాజు హామీ ఇచ్చారు. పర్యటనలో వైఎస్సార్‌సీపీ నాయకులు భరణికాన రామారావు, భగవతి విజయ్‌కుమార్, ఐ.రవికుమార్, పైడి కృష్ణారావు మాస్టర్, పొన్నాడ అప్పారావు మాస్టర్, సనపల నారాయణ స్వామి, వేణు, శివరాం, మురళీధర్, త్రినాథ్, పాతపట్నం రామ్మోహన్, శ్రీనివాస రెడ్డి, తమ్మినేని దాలినాయుడు, కూర్మారావు, రవికుమార్, స్వామి, పూజారి రాము, పవన్ పాల్గొన్నారు.

## ముస్లిం మైనారిటీల ఆత్మీయ సమావేశం నేడు


మాట్లాడుతున్న ఐ.హెచ్.ఫారూఖీ

**సీతంపేట:** వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా విశాఖ జిల్లా ముస్లిం మైనారిటీ ఆత్మీయ సభను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.హెచ్.ఫారూఖీ తెలిపారు. అక్కయ్యపాలెంలోని ఆయన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పోర్టు స్టేడియం వద్ద ఉన్న తమ కార్యాలయం పక్కన గల గ్రౌండ్‌లో సభ జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా పట్టభద్రులు, మత పెద్దలు పెద్ద ఎత్తున తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని కోరారు. విద్యావేత్త, వ్యాపారవేత్త యిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపిస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి మరింత దోహదపడుతుందని పేర్కొన్నారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారావు, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, మేయర్ హరివెంకటకుమారి, ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, విశాఖ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు కె.వి.బాబా, సీనియర్ నాయకులు దేవరకొండ మార్కెండేయులు, ముస్తఫా పాల్గొన్నారు.

## గైస్‌లో మహిళల రక్షణకు ప్రత్యేక విభాగం

ఇంటర్నల్ కంప్లెయింట్స్ సెల్ ప్రారంభం

**మురళీనగర్:** కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో వినూత్న కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా అంతర్గత ఫిర్యాదుల విభాగాన్ని(ఐసీసీ) ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏర్పాట్లు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. కాలేజీలో విద్యనభ్యసిస్తున్న బాలికలు, మహిళా అధ్యాపకులు తమకు సంబంధించిన సమస్యలపై ఈ విభాగంలో ఫిర్యాదు చేయవచ్చు. మహిళలు తమ సమస్యలు చర్చించుకునేందుకు ఐసీసీకి ప్రత్యేక గదిని కేటాయించారు. పెట్రోకెమికల్స్ సీనియర్ లెక్చరర్ ఎం.బోధమ్మ ఈ ఫిర్యాదుల విభాగానికి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. మహిళలను వేధించే వారిపై ఇక్కడ ఫిర్యాదు చేయవచ్చు. నేరుగా లేదా 'సబల' యాప్ నంబర్ 63026 66254కు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బోధమ్మ మహిళా లెక్చరర్లు, విద్యార్థినులతో సమావేశమయ్యారు. ఫిర్యాదులు చేసే విధానాన్ని ఆమె వివరించారు. వాటిని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారు. అవసరమైతే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటారు. మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నందుకు ప్రిన్సిపాల్ వెంకటరమణకు అధ్యాపకురాళ్లు, విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు.

# సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


కళింగనగర్‌లో కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


ఏపీఈపీడీసీఎల్ అధికారికి కరపత్రం అందిస్తున్న వై.వి.సుబ్బారెడ్డి

**సీతమ్మధార:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా గురువారం గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంస్థ సీఎండీ సంతోషరావు, అధికారులు, ఉద్యోగులకు కరపత్రాలు అందజేసి ఆయన మాట్లాడారు. ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీతంరాజు విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ శ్రేణులకు వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, డైరెక్టర్ సూర్యప్రతాప్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస రావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపల్లి గోవింద్, దేముడుబాబు మాస్టార్, రాజు, అమర్‌నాథ్‌రెడ్డి, కిరణ్‌రాజు, విశ్వనాథ్‌రాజు, అంబటి శైలేష్, శ్రీనివాసరాజు, నూకరాజు, ఆనంద్, చిన్న, రాజ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

**14వ వార్డులో..**

జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. 14వ వార్డులోని యోగా సెంటర్, రాకెట్ పార్కు, హిల్ పార్కుల్లో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో అమర్‌నాథ్‌రెడ్డి, కిరణ్‌రాజు, బల్ల శ్రీను, ప్రవీణ్, ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

**పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి..**

**సీతంపేట:** జీవీఎంసీ 43వ వార్డులో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ విస్తృత ప్రచారం నిర్వహించారు. శ్రీనివాసనగర్, నందగిరినగర్, వెంకటేశ్వర కాలనీ, మావూళ్లమ్మ గుడి ప్రాంతాల్లో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు అందజేసి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**48వ వార్డులో..**

**కంచరపాలెం:** జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి జైభారత్‌నగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీతంరాజుకు ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కన్వీనర్లు హేమంత్‌కుమార్, పాలేటి పద్మ, జాన్ జోసెఫ్, నాయకులు అప్పారావు, భరత్, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**51వ వార్డులో..**


**మద్రిపాలెం:** జీవీఎంసీ 51వ వార్డు 289 సచివాలయం పరిధి కళింగనగర్‌లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.


వెంకటేశ్వర కాలనీలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ ఉషశ్రీ

### సైబర్ మోసాలపై అప్రమత్తం

**బీచ్ రోడ్డు:** సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరమని, ఎటువంటి సందేహం ఉన్నా తక్షణమే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం సీఐ కె.భవానీప్రసాద్ సూచించారు. దిశా, సైబర్ పోలీసులు సంయుక్తంగా గురువారం సిరిపురంలోని డబ్ల్యూఎన్ఎస్ సంస్థలో ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజుల్లో సోషల్ మీడియాలో మహిళలపై జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని చెప్పారు. ఇంటర్నెట్ ఆధారంగా నేరాలు, ఆన్‌లైన్ షాపింగ్ పేరిట జరుగుతున్న మోసాలపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పాస్‌వర్డ్ సెక్యూరిటీ టిప్స్, ఫేక్ లోన్ యాప్స్‌పై అవగాహన కల్పించారు. దిశా సీఐ జి.నిర్మల మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న ఈవ్ టీజింగ్, వుమెన్ ట్రాఫికింగ్, మహిళ భద్రత కోసం వివరించారు.

## సీతంరాజును గెలిపిద్దాం


మాట్లాడుతున్న కె.కె.రాజు

**మద్రిపాలెం:** ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకోవాలని నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పిలుపునిచ్చారు. మాధవధారలోని కనకమహాలక్ష్మి కల్యాణ మండపంలో పొన్నాడ అప్పారావు మాస్టర్ గురువారం ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సుధాకర్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని 50, 51 వార్డుల పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సనపల చంద్రమౌళి, 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, తమ్మినేని నరసింగరావు, సనపల నరసింహ స్వామి, బుడుమూరి తిరుమలరావు, ధర్మవతి, అన్నెపు సన్యాసినాయుడు, సనపల నారాయణస్వామి, పాతపట్నం రామ్మోహన్, ఎం.వి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.